# విమర్శకునిగా కుందుర్తి



జి. మహేందర్

# విమర్శకునిగా కుందుర్తి

'పాతకాలం పద్య మైతే వర్తమానం వచనగేయం' అంటూ వచన కవితను ఒక ఉద్యమంగా భావించి, తన జీవిత కాలం వచన కవితా వికసానికి కృషి చేసిన వ్య క్తి కుందుర్తి. వచన కవిత్వాన్ని కుందుర్తి ఆరంభించక పోయినా వచన కవిత్వాన్ని ప్రచారం చేయటం వల్ల 'వచన కవిత్వ పితామహుడు' అయ్యాడు.

కుందుర్తి వచన కవి మాత్రమే కాదు. ఆ కవితా రూప ప్రచారం కోరకు పరిశ్రమించిన కవి విమర్శకుడు. కుందుర్తి వచన కవిత్వ ప్రచారానికి 38 కవితా సంపుటాలకు పీఠికలు రచించాడు. ప్రాచీన, ఆధునిక సాహిత్య విషయాలను వివరిస్తూ 55 విమర్శ వ్యాసాలు రాశాడు. పత్రికల్లో సమీక్షలు కూడా రాశాడు. ఇవన్నీ కుందుర్తి విమర్శ దృక్పథాన్ని విశదం చేస్తాయి. కుందుర్తి ఏ పుస్తకానికి పిఠిక రాసినా ఆ కావ్యం గురించి, కవిని గురించి తక్కువగా చెప్తారు. సమకాలీన సాహిత్య విషయాలకు సంబంధించిన ఎక్కువగా చర్చ చేస్తారు. అందుకే ఆయన పీఠికలన్నీ సాహిత్య వ్యాసాల్లాగా ఊంటాయి.

కుందుర్తి అనగానే మనకు వచన కవిత్వం గుర్తుకు వస్తుంది. వచన కవిత్వ స్వరూప స్వభావాలను నిర్దేశించి దాని ప్రగతికి కృషి చేసిన కవి విమర్శకులలో కుందుర్తిది ప్రత్యేక స్థానం. కానీ ఆయన విమర్శ రచనలు చదివినట్లయితే ఆయన భావాల, ఆలోచనల, ప్రతిపాదించిన విషయాల పరిధి అంతకంటే విస్తృతమైందని తెలుస్తుంది. కుందుర్తి పీఠికలు, వ్యాసాల్లో కళలు, సాహిత్యం, సమాజంపై కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలు కన్పిస్తాయి. కుందుర్తి జీవితాన్ని, సాహిత్యాన్ని, రూపాన్ని, వస్తువును వేరు చేసి చూడలేదు. శుద్ధ కవిత్వం అన్న భావాన్ని ఆయన నిరాకరించాడు. కవికి సామాజిక స్పృహ ఉండాలన్నాడు. సమకాలీన వాస్తవ పరిస్తితులను గుర్తించటం, సమజ పరిణామశీలాన్ని అంగీకరించటం, వస్తువుకు అనుగుణమైన శైలిని రూపొందించుకోవటం సామాజిక స్పృహలో భాగమని తెల్పాడు. సాహిత్య వేత్తలకు రాజకీయ అవగాహన తప్పనిసరిగా ఉండాలని కుందుర్తి భావించాడు. రాజకీయం అంటే ప్రజల జీవిత విధానాన్ని నిర్ణయించేది. తాను నమ్మిన వ్యవస్థను కోరేది. సమాజ మార్పుకు రాజకీయ నాయకుల చర్యలు దోహదం చేస్తాయి. ఈ మార్పుకు తోడ్పడేలా సాహిత్యం ఉండాలని, సమాజ పరిణామానికి దోహదం చేసిన అంశాల అధారంగానే సాహిత్య రంగంలో కవి స్థానం నిర్ణయమవుతుందని భావించాడు. కేవలం అభ్యుదయ కవులు మాత్రమే నిబద్ధత కల కవులనటాన్ని కుందుర్తి వ్యతిరేకించాడు. ప్రాచీన కాలం నుండి కవులంతా ఏదో ఒక విషయానికి నిబద్ధులైన వారేనని కుందుర్తి అభిప్రాయపడ్డాడు. రచయితకు మార్క్సిజం అవగాహన

ఉండాలని భావించినప్పటికి ఈ లక్షణం లేనంత మాత్రాన కవిత్వాన్ని తోసివేయలేమని భావించాడు.

తెలుగు సాహిత్యంలో వచన కవిత్వ ఆవిర్భావం ఒక సహజ పరిణామమని కుందుర్తి అభిప్రాయం. సృష్టిలో పాత రూపాలు పోయి కొత్తవి రావటం సహజం. పాత రూపాలు నవ్య చైతన్యాన్ని ప్రకటించలేవు. సంక్లిష్టమైన ఆధునిక జీవితాన్ని వచన కవిత్వం మాత్రమే చిత్రించగలదని పేర్కొన్నాడు. వస్తు నవ్యత, రూపనవ్యత కలిసే ఉంటాయని, కావ్య వస్తుగతమైన భావన ముందుగా మారి, ఆ భావాన్ని ప్రకటించడానికి యోగ్యమైన రూపాన్ని వెతుక్కుంటుందని తెల్పాడు. ఈ విధంగా వచన కవిత రూపాన్ని గురించి చర్చించటం వల్ల కుందుర్తిని రూపవాదిగా కొందరు భావించారు. వచన కవిత ఒక ప్రధాన రూపంగా స్థిరపడటానికి ప్రయోగాలు, విశ్లేషణలు జరుగుతున్న కాలంలో కుందుర్తి విమర్శలు వచ్చాయి. ఈ విమర్శ అంతా వచన కవిత్వాన్ని ఒక ప్రజా రూపంగా మలచటానికే అంటే వచన కవిత్వాన్ని సామజిక వస్తు ప్రధానంగా చేయటానికే ఆయన వచనకవిత్వాన్ని ప్రోత్సహించాడు. కేవలం రూపం గురించి మాత్రమే చెప్పకుండా వస్తు రూపాల మధ్య సమన్వయాన్ని కోరాడు. వచన కవిత గురించి ఆయన వివరణల్లో వస్తు ప్రాధాన్యత స్పష్టంగా కనిపిస్తుంది.

తెలుగులో భావ కవిత్వం తీసుకువచ్చిన నవ్యత తక్కువని అది రూపంలోనూ, భావంలోనూ సంప్రదాయానికి దగ్గరని కుందుర్తి పేర్కొన్నాడు. అభ్యుదయ కవిత్వం భూస్వామ్య భావజాలన్ని సమూలంగా పెళ్ళగించిందని, కవిత్వాన్ని సామాన్యునికి దగ్గర చేసిందని పేర్కొన్నాడు. దిగంబర కవిత్వంలోని లోపాలను ఎత్తి చూపుతూనే, ఆ కవిత్వం అభ్యుదయ కవిత్వాన్ని విస్తృతం చేసిందన్నాడు. అనుభూతి వాద కవిత్వం భావ కవిత్వాన్ని తిరిగి తెచ్చే ప్రయత్నమని తెల్పాడు. కవిత్వంలో ఆత్మాశ్రయ పద్ధతిని, పాశ్చాత్య వ్యామోహాన్ని, ప్రయోగ వాదాన్ని, ఆంగ్ల, సంస్కృత పదబంధాలను కుందుర్తి నిరసించాడు.

కుందుర్తి ప్రతిపాదనల్లో ఎక్కువగా చర్చాపాత్రమైంది ఆయన కథాకావ్య సిద్ధాంతం. వచన కవితలో భావాలు పునరుక్తం కావడం, ఆత్మాశ్రయత్వం, రసపోషణకి ఎక్కువ అవకాశం ఉండకపోవటం, కవిత్వం వచనస్థాయికి దిగజారాడం మొదలైన లోపాలున్నాయని కుందుర్తి భావించాడు. అందుకే ఆధునిక కవిత్వంలో కూడా కథ ఉండాలనే కథాకావ్య సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. వస్త్వాశ్రయ పద్ధతిని అనుసరించడం వల్ల జీవితంలోని వైవిధ్యాన్ని ప్రదర్శించవచ్చని కుందుర్తి అభిప్రాయం. ఏమాత్రం కథాంశం లేని కవితలు కేవలం ప్రబోధ గేయాలు, వర్ణనాత్మక రచనలు కావచ్చు కానీ, రసపోషణకు, సమగ్ర జీవిత చిత్రణకు, నాటకీయతకు సరిపోవని భావించాడు. అయితే కవిత్వం ఛందస్సు నుండి తప్పుకున్నట్లే కథా సంవిధానం అనే అనవసరపు తొడుగు నుండి కూడా తప్పుకుందని శ్రీశ్రీ, తిలక్, రమణారెడ్డి భావించారు. వచన కవిత్వం కేవలం అనుభూతుల ఆవిష్కరణ కోసమే ఏర్పడిందనీ, దానిలో

కథాకావ్యం రాయడం మళ్ళీ పాత మార్గంలోకి ప్రయత్నించడమేనని వారు వాదించారు. వచన కవితలోఅనుభూతి కవిత్వం, నినాద పూరితమైన కవిత్వం వస్తున్న కాలంలో కుందుర్తి చేసిన ప్రతిపాదన సులభంగా తోసివేయగలిగింది కాదు. విప్లవ కవిత్వ కాలంలో కథా సహిత గేయాలకు ఎక్కువ ప్రచారం రావడం గమనించదగిన విషయం.

వచన కవిత్వ రచనకు వ్యవహారిక భాష మాత్రమే అనుకూలమైందని కుందుర్తి ప్రతిపాదించాడు. కవిత్వపు శైలి సామాన్య ప్రజల సంభాషణ స్థాయికి రావాలని ఆకాంక్షించాడు. వచన కవిత్వానికి, పూర్వ కవిత్వానికి గల ప్రధానమైన భేదం ఛందస్సును వదలడం. అయితే వదిలి వేయబడిన ఛందస్సు ప్రభావం విరుపు, విసురు, తూగు, ఊపు, లయ మొదలైన వాటి ద్వారా సాధించబడుతున్నాయని తెల్పాడు. అయితే ఈ పదాలను పరిభాషగా వాడలేదు. వీటికి అర్థాలను కుందుర్తి వివరించలేదు. వీటిని గురించి ఎక్కువగా చర్చించలేదు. ఈ విధంగా వివరణలు లేకుండా వచన కవిత్వ లక్షణాలు చెప్పడానికి ప్రయతించడాన్ని వచనకవిత్వ లక్షణ చర్చ చేసిన చేకూరి రామారావు, కోవెల సంపత్కుమారాచార్య తప్పు పట్టారు. కుందుర్తి వాడిన ఈ పదాల్లో అస్పష్టత కన్పింస్తుంది.

కుందుర్తి తన విమర్శలో మినీ కవిత్వాన్ని వ్యతిరేకించాడు. మినీ కవితలో అస్పష్టత ఏర్పడుతుందనీ, సూక్తులు, నినాదాలు ఎక్కువగా వస్తున్నాయనీ అన్నాడు. కుందుర్తి గురజాడ, తిలక్, శ్రీశ్రీ, బైరాగి మొదలైన వారి కవిత్వ తత్వాన్ని ఆవిష్కరిస్తూ విమర్శ చేశాడు. తిలక్ కవిత్వాన్ని అభ్యుదయ భావన, కాల్పనికోద్యమ శైలి మేళవింపుగా అభివర్ణించాడు. శ్రీశ్రీ, తిలక్ కవిత్వంలోని గ్రాంథిక భాషా ఛాయలను నిరసించాడు.

కుందుర్తి అభ్యుదయ కవి. తన కవితా సిద్ధాంతం మార్క్సిజం అని తన కమిట్‌మెంట్ కూడా దానికే అని ఇంటర్వ్యూల్లో చెప్పుకున్నాడు. కుందుర్తి విమర్శ రచనల్లోనూ మనకు ఈ దృక్పథమే కన్పిస్తుంది. ప్రతీ కవితా ఉద్యమాన్నీ, రూపాన్నీ అది పుట్టి పెరిగిన సామాజిక, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో కుందుర్తి విమర్శించాడు. వస్తువు, రూపం రెండూ అభ్యుదయ పథంలో నడవాలని తెల్పిన కుందుర్తిని అభ్యుదయ విమర్శకునిగా చెప్పవచ్చు.



జి.మహేందర్ ,
పిహెచ్.డి. పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.